బ్రతుకన్నది ఒక వరం

రాత్రి—ధీరుడి మనసువలె నిశ్చలంగా వుంది. వెన్నెల మవునంగా కాస్తున్నది.

అయిదువందల గజాల తోటమధ్య బంగళాలో మూల పడగ్గదిలో చీకటి వున్నది కాని దాని అధికారాన్ని సవాలుచేస్తూ చాల చిన్న బల్బు వున్నది.

ఖరీదయిన తివాసీపై వెడల్పాటి మంచంపైనున్న మెత్తటి పడక పైన తల్లిగర్భంలో శిశువువలె ముడుక్కొని పడుకునివున్నాడు వెంకట కృష్ణయ్య.

మంచం తలవైపు గూటిలోవున్న బుద్ధుడి చూపులలోనే బాధలన్నీ కరిగిపోతాయి. అవతల షెల్ఫులో నానారకాల పుస్తకాలూ పత్రికలూ సహజీవిస్తున్నాయి. పై పుస్తకాల వరసమీద ఒక గడియారం—నీలం రంగుది—మనిషి మేధస్సుమీద యంత్రపు అధికారంలా కూచునివున్నది గంట రెండున్నర అని ముచ్చటగా చెబుతున్నది.

కిటికీలో ఇరుక్కున్న 'కూలర్'—ఆ గదికీ, బయటి ఉక్కపోతకూ మధ్య దబ్బుపెట్టిన గోడలావుంది.

కృష్ణయ్య ఇటు పొర్లాడు. ఆయన తలవెంట్రుకలు తళుక్కుమన్నాయి. అది చూచేకాటోలు ఆయన కాళ్ళవైపు గోడమీద పెద్ద కేలండర్‌లో సినిమాతార నవ్వుతూంది.

చీకటిలో వెలుగులాగ, మిథ్య మధ్య నిజంలాగా–గాఢనిద్రలోని ఒకవిధమైన మెలకువలో వున్నాడు కృష్ణయ్య. మూసుకునివున్న కళ్ళ తెరపై అంతరంగం ఏదేదో దృశ్యాల్ని ఆడిస్తున్నది. చూస్తున్నది. అర్థమయినట్లేవుంది. లంకెలన్నిటిని మరిచినా లంకెల వెనక అంకాలను మరవలేదు మనసు.

ఆ నిద్రలో—ఆ మెలకువలో ఒక శిశువు యాభై గంటలుమాత్రం ఈ భూమ్మీది గాలిని పీల్చినవాడు కేరుమన్నాడు.

కృష్ణయ్య నిద్ర ఇంచుమించు హత్య కావింపబడింది. కాని కాలేదు దుప్పటిలాగి కప్పుకున్నాడాయన.

రాజ్యం చివరిసారి అనారోగ్యంతో ఆర్నెల్లు ఆస్పత్రిలో వుండగా–ఇదేగదిలో ఆ బుధవారం సంజెవేళ ఆ షెల్ఫుప్రక్కన కూచుని పత్రికేదో తిరగవేస్తుంటే–కుర్చీలేవో లోపలికి తీసుకొచ్చి అమర్చడానికి ఎల్లమ్మ వస్తే–పత్రికమీదుగా తన కళ్ళటు మళ్ళితే–పనిచేసుకుంటున్న ముప్పైయేళ్ళ ఎల్లమ్మ వంటిమీది వంపులన్నీ గుండ్రటి అక్షరాలై, ఆ అక్షరాలన్నీ కలిసి చీకటికి ఆహ్వానంగా అనిపిస్తే ట్యూబ్‌లైట్ వెలుతురుండికూడా లేనట్లయితే–నలభైయేడేళ్ళ జీవితపు నిగ్రహముండికూడా లేకపోతే–నరాలన్నీ బిగుసుకుపోతే–పత్రిక ప్రక్కకు పడిపోతే–అదిరిపడి వెనక్కుతిరిగిన ఆ కళ్ళల్లోని ప్రశ్నా భయమూ చూసికూడా చూడక కళ్ళకడ్డంగా కప్పుచేర్చిన ఆ క్షణం—

మళ్ళీ మళ్ళీ ఆ క్షణాన్నే, రాజ్యం ఇంటికొచ్చేలోగా, ఎన్నిసార్లు గుణించాడో తెలియదుగాని–

రెండు నెలల తర్వాత ఎల్లమ్మ ఒక దారుణ సత్యాన్ని చెప్పినపుడు మాత్రం గూబ పెళ్లుమన్నట్లయింది. ఛీ—ఆ విధవ కడుపున తన బిడ్డ! అసహ్యం వేసింది

రాజ్యం వచ్చేలోగా దానికి అయిదువందలిచ్చి పంపేశాడు.

తర్వాత ఒక సంవత్సరానికి—అప్పటికి రాజ్యంపోయి రెండునెల లయింది—మళ్ళీ వచ్చింది ఎల్లమ్మ.

మందులేమీ పనిచేయలేదట. ఆ బిడ్డను కన్నదట. రెండు రోజుల తర్వాత చనిపోయిందట. నిజమేనా....కాదు....కాదు....ఈ మనిషి....

మళ్లీ అయిదువందలిచ్చి కృష్ణయ్య తాత్కాలికంగా మనశ్శాంతిని కొనుక్కున్నాడు. కృష్ణయ్య కాళ్ళు జాచుకుని మంచంకొసకు జరిగాడు. ఆయన తలక్రింది దిండుగలేబుమీద రెండు రామచిలుకలూ ఎప్పటిలాగే ముచ్చట లాడుతుంటున్నాయి. గడియారంలో పెద్దముల్లు ఏడంకెతో పరా చికాలాడ నారంభించింది.....

గలగలలాడే నీరునిండిన ఏరు....ఆ నీటిలో తన రంగు బాగుందా లేదాఅని కాబోలు చూచుకుంటూంది ఆకాశం. గట్టుమీది గడ్డిమొక్కలు అవునౌనని తలలూపుతున్నాయి. ఇవతలి పొలంలో వరిపైరు సైనికుల బారుల్లా నిలిచివుంది....గభుక్కున ఏటినీరంతా ఎర్రగా అయింది....ఏరూ, పైరూ, ఆకాశమూ అన్నీ ఎగిరిపోయాయి. ఏరంత నెత్తుటిమధ్య ఎర్రటి పడ వలా రక్తసిక్తమయిన తలతో పడిఉన్నాడు....ఎవడు? అతడు.... అతడు....?

ఏటి ఒడ్డునున్న ఆ పొలాన్ని కొని—అక్కడ ప్రకృతి ఒడిలో అంద మైన ఇల్లు కట్టుకుని అపుడపుడు మిత్రులకు పెద్దలకు విందులిచ్చుకుని పైపైకి మెట్లు వేసుకుందామని, కులాసాగా వుందామని అనుకుంటే ఆ రాజారావ్ పొలంఅమ్మను పొమ్మన్నాడు. ఎంత గర్వం! తనంతటివాడిని,

మాటకు ఎదురెరుగనివాడిని_నాలుగువేలకు బదులు ఇరవై వేలిస్తానన్న వాడివి తిరస్కరించాడే, తాత ముత్తాతలనాటి పొలాన్ని ఫల్గుణుడే వచ్చినా ఇవ్వనన్నాడే....ఎంత అవమానం!—

సరిగ్గా ఆరువారాల తర్వాత పోలాయికి రెండువేలిస్తే పనయి పోయింది. రాజారావు ఘనత వహించిన అతడి తాత ముత్తాతలను చేరు కున్నాక—ఇరవై రోజులు తిరుగకముందే వాళ్ళావిడ ఆ పొలాన్ని ఆరు వేలకు తనకమ్మి పుట్టిల్లు చేరుకుంది.

మంచపు ఆ చివరనుండి ఈ చివరకు పొర్లడంలో కృష్ణయ్య నోటి లోని చొంగ కుడిబుగ్గమీదకు కారింది. ఆ తడిగీత నైట్ బల్బ్ వెలుతు రులో ఒక భాగాన్ని దాచుకో యత్నించింది. నిద్రలోనే కాళ్ళకు దగ్గరగా దిండుకు చేర్చుకున్నాడు కృష్ణయ్య. గడియారం పడకమీద, మూడంకె దిండుమీద, నిముషమాత్రం పెద్దముల్లూ చిన్నముల్లూ గాఢ పరిష్వంగంలో లీనమయ్యాయి.

అంగుళం వెడల్పున్న నల్లపురుగొకటి ఝుమ్మంటూ ఎగిరివెళ్ళి బల్బుమీదపడి ఆ వేడికి ఎగిరి బుద్ధుడి మొహంమీదపడి, అక్కడ పట్టు దొరక్క_ బుద్ధుడివళ్ళోపడింది. బుద్ధుడు ఇంకా నవ్వుతూనే వున్నాడు.

ఏడుస్తున్నట్లు సన్నగా మూలిగాడు కృష్ణయ్య.

ఈడల మర్రిచెట్టుక్రింద మినుకు మినుకు మంటుంటే ఎవరక్కడ అని అరిచేవాడు తను. జవాబులేదు. చేతిలోని టార్చివేశాడు. వెలుతురు నాలుకకు ఏమీ అందలేదు. ఆకులు చప్పుడయినట్లయింది. గబగబ చెట్టు క్రిందకు, ఈడల గుబురుమధ్యకు నడిచి టార్చిని పైకివేసి చూశాడు.

మరుక్షణం_బాబోయ్ కొన్నివందల చేతులు తనపీకని నొక్కెయ్య సాగాయి....అరిచాడు.... విదిలించాడు....కొరికాడు .... ఒక్కదూకులో ఇటొచ్చి నేలమీదకుపడ్డాడు. టార్చి చేతినుండి ఎగిరిపోయింది. కాని పెద్ద

మెరుపులాటి వెలుతురు దానితోబాటే, హహా అని నవ్వు!! అదుగో ఆ ఊడలుండినచోట్ల విశ్వనాథం, ఆయన పెళ్ళాము....కొడుకులిద్దరూ!....

చదువులేని తాను పల్లెవిడిచి, పట్నంచేరి రోడ్లవెంబడి తిరుగుతుంటే ఉద్యోగం ఇప్పించాడు విశ్వనాథం. ఆ ఉద్యోగం సరిపడక తను వ్యాపారం పెడతానంటే నోటుకూడా రాయించుకోకుండా ఆరువేలిచ్చాడు విశ్వనాథం. అయిదేళ్ళలో తన బట్టల వ్యాపారం పదివేల నిచ్చింది. విశ్వనాథంగారి రోజులు చెడ్డాయి. ఉద్యోగం చేస్తున్న కంపెనీ మూశారు. తన దుకాణంలో చేరవచ్చాడు. ఆయన కొడుకులిద్దరూ డబ్బులేక స్కూలు ఫైనలు కూడా చదవలేకపోయారు. ఆయన పెళ్ళాం మెడలో పసుపుదారం మిలిచింది. తన్నడిగాడు ఆ డబ్బిమ్మని! ఆరువేల రూపాయలు! నోటు కూడా లేదు. ఈ పిచ్చి బ్రాహ్మడేం చేస్తాడులే అని అప్పుడోయా భై ఇపుడొక వందా ఇచ్చాడు. చివరకు ఒకనాడు చిరిగిన చొక్కాతో, నలిగిన కాగితంతో వచ్చాడు విశ్వనాథం. వడ్డీతోసహా లెక్కవేస్తే ఎనిమిదివేలా ఎంతో అయిందిట. తానిచ్చిందిపోగా, ఇంకా ఏడువేలవంద వుందిట. తనకు నవ్వొచ్చింది. "అయ్యగారూ! కాగితమూ పాడులేకుండా ఏడువేలు ఎందుకు ఇవ్వాలయ్యా" అన్నాడు తను నవ్వుతూ. గిరుక్కున వెనక్కు వెళ్ళిపోయాడు విశ్వనాథం.

మరురోజు పొద్దున రాజ్యం నిద్రలేపి చెప్పింది. ఆ కుటుంబంలో నలుగురూ ఉరిపోసుకు చచ్చిపోయారుట!

మెడమీద గోక్కుంటున్న కృష్ణయ్య చేతికి నల్లపురుగు దొరికింది. ఉలిక్కిపడి లేచాడు ఆయన. ఆ పురుగును విసిరిపారేశాడు. భయం భయంగా గదినంతా కలయజూశాడు.

తనింతసేపూవున్న నరకం ఏమయింది? అదంతా నిద్రేనా-కాదు- తన జీవితపు సినిమాకు నెగెటివ్ అది....పదవి, పేరు, డబ్బు, నాయ

కత్వంవంటి నవరత్నాలు గుచ్చిన హారం నిజానికి ఎముకల మాలగా తెలియవచ్చింది. ఎంత భయంకరం....

రాజ్యం చల్లగా దాటుకుని అయిదేళ్ళయింది. అదివున్నంతకాలం— రోగం, రోగం, స్పెషలిస్టులు, మందులు, రోగం!

పెళ్ళయి నాలుగయిదేళ్లు హాయిగా వున్నారేమో! అంతే! తమ ఆనందపు ఉదయం అది. అప్పటి కిరణం అబ్బాయి భాస్కరం.

అబ్బాయి!

రాజ్యం పోనేపోయింది. అబ్బాయి—వుండీ లేనట్లే....

గభుక్కున దిండులోకి ముఖం దాచుకున్నాడు కృష్ణయ్య. టేబిలు మీది రామచిలుకలు వెచ్చటి నీళ్ళలో స్నానంచేస్తుంటే బుద్ధుడు ప్రశాంతంగా చూస్తున్నాడు. గడియారం అయిదుకొట్టినా అవి అడుగుతూంది. అడిగి అడిగి విసుగెత్తి అయిదు అయిందని అలారం గొంతుతో అరిచింది.

దిండుకు దూరమయిన కృష్ణయ్య కళ్ళకు తలుపుప్రక్కన టేబిలు మీదవున్న కొడుకు ఫోటో కనుపించింది. ఆయనలేచి ట్యూబ్‌లైటు వేశాడు. టేబుల్‌మీద ఫోటో ప్రక్కన కప్ప ఆకారంలోవున్న పేపర్ వెయిట్‌ని ప్రక్కకుంచాడు. దానిక్రిందవుంది బొంబాయినుండి నిన్న సాయంకాలం వచ్చిన నాలుగుపేజీల ఉత్తరం

"....డబ్బు మనిషినేమిచేస్తుందో అతడిచేత ఏమేమి చేయిస్తుందో తెలుసుకున్నాను. కనుక మీ ఆస్తి నాకు రాకపోవడమే మంచిది. నేనూ మేరీ మాకు కావలసింది సంపాదించుకోగలము. ఒండొరులపై విశ్వాసంతో, జీవితంమీద పూర్తి నమ్మకంతో మొదటి అడుగువేస్తున్న మా భవిష్యత్తు అనే పలకమీద నీడలులేకపోవడం మంచిదే.

—భాస్కరం."

III

—'భా' మీద కన్నీటిచుక్క పడి చెదిరింది. కళ్ళనీళ్ళను వేలితో తుడిచిన కృష్ణయ్య పెద్దబీరువా తాళం తెరిచి గుడ్డ మడతల వెనకవున్న రివాల్వర్‌ని తీసిచూశాడు. దీపంవెలుగులో రివాల్వర్ తాచుపాములవలె మెరిసింది.

మంచంమీదకువెళ్ళి కూచున్నాడు కృష్ణయ్య. చుట్టుప్రక్కల తేరిపారచూశాడు. ఒక్కక్షణం ఆయన కళ్ళల్లో విముక్తి తళుక్కుమంది....

మరుక్షణం రివాల్వర్‌ని పరుపుమీద పారేశాడు.

ఇదేమి పిరికితనం? ఒప్పని నమ్మినది తప్పని తెలిస్తే పారిపోవడమా? ప్రేయసి అని కౌగలించుకున్నది అస్తిపంజరమయితే ఆత్మహత్యకు పాల్పడడమా?

మనిషి కన్ను మూయవచ్చు. చట్టం నోటికి తాళం వేయవచ్చు. ఇవి సులభమే. కాని—

కానీ, తనకు ఇన్నిరోజులుగా తెలియని కన్నొకటి తన్ను చూస్తున్నది. తను వినని గొంతొక్కటి మౌనంగా ఘోషిస్తున్నది. అందుకని ఇప్పుడు కన్నూ చెవీ శాశ్వతంగా మూసేసుకోవడమా—ఊహూ!

వెనుకటి జీవితపు ప్రతి అడుగులో తాను చేసిన ఒక్కొక్క నేరానికి ఒక్కొక్క శిక్ష అనుభవించాలి. నిప్పులమీద నడిచి మళ్ళీ మనిషి కావాలి. మొసళ్లున్న నదిలో ఈది ఇవతలకు రావాలి అప్పుడూ తానొక వ్యక్తి! చూడరానిది, అయినా అనుక్షణమూ చూస్తూవుండేది అయిన ఆ కంటి ఎదుట నిలబడాలి. వినరానిది అయినా నిరంతరం మాటలాడేది అయిన ఆ స్వర్గాన్ని కులాసాగా పలకరించాలి. అదీ బ్రతుకంటే! తానూ బ్రతకాలి.

-మంచంమీదనుండి లేచాడు కృష్ణయ్య. లేచి గది కిటికీ తలుపులు తెరిచాడు. ఆకాశం పిరికిపందలా పారిపోతున్న చీకటినిచూచి కాబోలు-

కంట్రోల్ చేస్తున్నది. వెలుగురాకతో దారులు తెలిసిన పక్షులు ఆకాశపు స్వేచ్ఛలోకి ఎగిరిపోతున్నాయి.

....అయిదారుగంటల తర్వాత కృష్ణయ్య కలెక్టరాఫీసు భవనంలో మేడమీద పెద్ద గదిలో కలెక్టర్ ధర్మారావు ఎదుట ఆసీనుడయ్యాడు.

"నమస్కారమండీ....చాల రోజులయింది కలుసుకుని....మొన్న హైదరాబాదునుండి సెక్రటరీ....గారు ఫోనుమీద మాట్లాడుతూ మీరటు వైపు రావడంలేదేమని అడిగారు కూడా-" అన్నాడు ధర్మారావు.

తల వూపాడు కృష్ణయ్య. బంట్రోతు రెండు కప్పులతో కాఫీ తెచ్చిపెట్టాడు. లాంఛనానికి ఎంగిలిచేసి కాఫీకప్పుని క్రిందపెట్టి పెద్దగా నవ్వాడు.

"అబ్బే, ఏమీలేదు. నేను మీతో కొన్ని విషయాలు చెప్పదలచు తున్నాను. అవి విన్నతర్వాత మీరు నాకు ఇట్లాగే కాఫీ ఇవ్వగలరా అని పించింది."

"నాకేమీ బోధపడడంలేదు." అన్నాడు ధర్మారావు.

చేతి గడియారం చూచుతున్నాడు కృష్ణయ్య. పదకొండూ ఇరవై అయింది.

"ధర్మారావుగారూ, వినండి!"—అని మొదలెట్టి తన గుండెమీద మండుతున్న నిప్పులను, తన మనసున ఆడిన పాముల పడగలను పదా లుగామార్చి ధర్మారావు ఎదుట వుంచాడు కృష్ణయ్య. ఒక పరాయి స్త్రీ శీలం, ఒక శిశువు ప్రాణం, మరొక రైతు హత్య, ఇంకొక కుటుంబపు ఆత్మహత్య—ఇవిగాక వోట్లకోసం పర్మిట్లకోసం తను వేసుకున్న లంచాల వంతెనలు, మంచాల విచ్చెనలు-అన్నిటినీ గబగబ చెప్పాడు కృష్ణయ్య.

"ఇపుడేమంటారు ధర్మారావ్! ఈ బురఖాని చింపండి. ఈ బూట కాన్ని బయటపెట్టండి. నన్ను అరెస్టు చేయించండి...."

ఈ ప్రపంచాన్నే తన అరచేతివలె ఎరిగినవాడిలా నవ్వాడు ధర్మా రావు. నిదానంగా పలికాడు. "అయ్యా, కృష్ణయ్యగారూ, నాకు ఆశ్చర్యం వేస్తున్నది. చాల ఆశ్చర్యం వేస్తున్నది. ఎందుకో తెలుసా? మీరు చెప్పిన వన్నీ చేసినందుకుకాదు. చేసినవన్నీ చెప్పినందుకు....మీరు చేసినవన్నీ అతి సహజమైనవి....పైకి రావడానికి చాల అవసరమయినవి. అదొక లా ఆఫ్ లైఫ్....మీలాటివారు ఇంత అమాయకంగా అవన్నీ నాకు చెప్పడమేగాక వాటిని నేను విపరీతంగా అర్థం చేసుకుంటానని ఎదురు చూడడం వింతగా వుంది...."

పామునుచూచి త్రాడనుకున్నారయ్యా. ఇది పొరబాటు. పాముని చావగొట్టండి—అని చెబుతుంటే, ఇది త్రాడే, కాని ఇది పామువలె వుండడం సహజం అంటాడేమిటి? నవ్వాలా ఏడవ్వాలా అని సంశయం వచ్చింది కృష్ణయ్యకు.

ధర్మారా వింకా చెబుతున్నాడు. "....ఈ వూర్లో ఆ రాధాకృష్ణ మందిరం కట్టించింది మీరు. గవర్నమెంటు ఆస్పత్రికి ఫర్నిచర్ కొని చ్చింది మీరు. హైస్కూల్లో ఏడాదికి పది ఉచిత వేతనాలు ఏర్పరచింది మీరు....వెలుగూ....చీకటీ అందరిలోనూ వుంటాయి. ఆ చీకటిని చూడ గల్గడమే మీ అవుదార్యాన్ని చాటుతుంది. కాని మీలాటి పెద్దలు, ప్రజా నాయకులు చెయ్యవలసిన పనికాదది"—

"—ఇహ ఆపండి!....ధర్మారావుగారూ, మరొక చిన్న వార్త చెబుతా వినండి....ఆ రాధాకృష్ణమందిరంలోనే ఒకమూల, నేలమట్టానికి దిగువ ఒక అచ్చువేసే శాలవున్నది. అక్కడ ఏమి అచ్చువేస్తున్నారో తెలుసా? 'కృష్ణ కర్ణామృతమూ', 'భగవద్గీతా' అనుకుంటున్నారేమో కాదు....అక్కడ ముద్రిస్తున్నది దొంగనోట్లు!"

ధర్మారావ్ కనుబొమలు ఎగిరాయి.

"అవును!....ఐదులు, పదులు, వందలు అన్నినోట్లూ వేస్తున్నారు. వేయిస్తున్నది ఎవరో తెలుసా?—నేనే! ....ఇప్పుడయినా మీ కర్తవ్యం నెర వేరుస్తారా?"

ఒక నిముషంసేపు ఏమీ మాట్లాడలేకపోయాడు ధర్మారావు.

"కృష్ణయ్యగారూ! ఇదే నిజమయితే, నేనేగనుక ఈ దొంగనోట్ల ముద్రణాలయాన్ని పట్టుకోగల్గితే నా ప్రమోషన్లకూ, నా భవిష్యత్తుకూ ఎంత బ్రహ్మాండమయిన అవకాశం అనుకున్నారూ? ఇంతటి మేలుచేసిన మీకు ఎట్లా కృతజ్ఞత చెప్పడం—ఎట్లా"

ఈసారి మవునం కృష్ణయ్యను వరించింది.

"....అయినా మీబోటివారికి దానితో సంబంధం వుందంటే ఎవ రయినా నమ్ముతారుటండీ—నామీద పెద్దజోకు విసురుతున్నారు మీరు! అవునా?"

తటాలున లేచాడు కృష్ణయ్య. కుర్చీ వెనక్కు-పడింది. ఆయన కళ్ళు మెరుస్తున్నాయి. పళ్ళుబిగించి గొణిగాడు .... "అంధులు.... మూర్ఖులు...." అని గిరుక్కున తలుపు తీసుకుని ధణధణమని అదిరే అడుగులతో నడవసాగాడు. ఆయన కాళ్ళక్రింద తివాసీయే గనుక లేక పోతే ఆ అడుగుల దెబ్బకు క్రిందవారి నెత్తిమీద గచ్చూడిపడేది. మంది పడుతున్న వేగంతో చరచర మెట్లు దిగసాగాడు.

అదేవేగంతో మెట్లు వంపు తిరగడంలో పట్టు తప్పింది.

అంతే దబదబమని దొర్లుకుంటూ ఇరవై మూడు మెట్లూ క్రిందకు వచ్చిపడ్డాడు కృష్ణయ్య.

*　　*　　*

స్పెషల్‌వార్డులో రాత్రి డ్యూటీ నర్సు కమల చేతి వాచీ చూచు కుంది. తొమ్మిదిన్నరయింది. ఆరోనెంబరు గదిలోకి అడుగుపెట్టింది.

తలవెనుక మూడంగుళాల పొడవున కుట్లతో, ఎడమ మోకాలినుండి మడమదాకా ప్లాస్టర్ తొడుగుతో మంచంమీద పడివున్న కృష్ణయ్యకు స్పృహపోయి ముప్పైరెండు గంటలు దాటింది.

అప్పుడే లోపలికివచ్చిన కమల, కృష్ణయ్య పెదవులనుండి బుసలు బుసలుగా ఏదో చప్పుడు రావడం గమనించింది. కాస్సేపుచూచి బయటికి వెళ్ళింది.

పది నిముషాల తర్వాత డాక్టర్ డేవిడ్‌తోబాటు వచ్చింది.

ఉండుండి కృష్ణయ్య పెదవులు కదలుతూనే వున్నాయి. కమల ఆ విషయం డాక్టర్ డేవిడ్‌కు చెప్పింది.

డేవిడ్ కృష్ణయ్య మంచం ప్రక్కనే స్టూలు వేసుకుని కూర్చుని పరీక్షించాడు. కృష్ణయ్యను అతి శ్రద్ధగా గమనించాడు. ఇరవై నిముషాలకు కృష్ణయ్య ముప్పైమూడు గంటల తర్వాత మొదటిసారిగా, కళ్ళు తెరిచాడు. పెదవులు తెరిచి, అస్పష్టంగా మూలిగాడు. కళ్ళు మూసుకున్నాడు.

ఆయన పిడికిళ్ళు గట్టిగా మూసుకున్నాయి. ముఖమంతా ముడతలు పడింది. ఏదో గట్టిగా అరిచాడు. పళ్ళు పటపట కొరికాడు. కాళ్ళు తన్నుకుంటున్నాడు.

కమల పరుగెత్తుకొచ్చి ఆయనను పట్టుకుంది. డేవిడ్ ఇంజక్షన్ ఇచ్చాడు.

క్రమంగా కృష్ణయ్యలోని భూకంపం సర్దుకోసాగింది. పిడికిళ్ళు తెరుచుకున్నాయి. ఆయన కండరాలన్నీ విశ్రమించసాగాయి. ఆయనను మత్తు ఆవరించింది.

డేవిడ్ లేచి కమలతో ఏదో చెప్పి తన గదిలోకి వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి రెండు మూడుసార్లు కమల ఆ గదిలోకి వచ్చి చూచి వెళ్ళింది.

తెల్లవారింది.

కృష్ణయ్య కళ్ళు తెరిచాడు. చుట్టూరా పరికించాడు. తెల్లటి గోడలు, తెల్లటి పడకగుడ్డలు, తెల్లటి షెల్ఫు-కనుపించాయి.

నెమ్మదిగా తల కదిలించకుండానే చూపుల్ని ప్రక్క కిటికీవైపు సారించాడు. అవతలెక్కడో పెద్ద చెట్టేదో వుంది కాబోలు-దాని తాలూకు చిన్నకొమ్మ ఒకటి ఈ కిటికీ ముందర కదులుతున్నది. అప్పుడే ఉదయిస్తున్న సూర్యుడి కిరణాల స్పర్శకు కాబోలు పులకించి నృత్యం చేస్తున్నాయి ఆ లేతపచ్చ ఆకులు.

తలుపు తెరిచిన చప్పుడయింది. ఉలిక్కిపడ్డాడు కృష్ణయ్య. కండ్లు ఇటు మళ్ళించాడు. కమల లోపలికి వచ్చింది-ప్రశాంత వదనంతో.

ఇంతవరకూ గమనించలేదు. కృష్ణయ్య తన ఎదుట ఆ షెల్ఫుమీద ఒక ఫ్లవర్ వేజు వున్నది. కమల అందులో పువ్వులగుత్తి నుంచింది. ఇటు తిరిగింది

"ఏమండీ....బాగా నిద్రపోయారా రాత్రి" చిరునవ్వుతో పలకరించింది కమల.

కృష్ణయ్య మాట్లాడలేదు.

"బెంగపెట్టుకున్నారా, అబ్బే! మీకేమంత పెద్ద గాయం తగిలిందనీ? ఇంకొక నెలలో ఝుమ్మన అందరితో కలిసి హాయిగా తిరుగుతుంటారు లెండి!"-అంది కమల ఆయన చేతిని తడుతూ.

చల్లని స్పర్శ-లేత ఆకులు-బంగారు కిరణం-రంగు రంగుల పువ్వులు-అబ్బే....తాను అందరిలో ఒకడుగా ఎన్నటికీ కాలేడు. ఆ హక్కును ఏనాడో కోల్పోయాడు.

నిట్టూర్చాడు కృష్ణయ్య.

['ఆంధ్ర సచిత్ర వారపత్రిక' జనవరి 66]